క్లుప్తంగా

12న మహాజన సభ

ప్రొద్దుటూరు : స్థానిక ప్రొద్దుటూరు కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్ మహాజన సభను ఈ నెల 12న ఉదయం 11 గంటలకు స్టోర్ ఆవరణలో నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు గజ్జల కళావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన స్టోర్స్ ఆర్జించిన నికర లాభం రూ.1,78,320లను బైలా ప్రకారం వివిధ పద్దులకు కేటాయించామని ఆమె పేర్కొన్నారు. స్టోర్స్ తరఫున ఖాళీగా ఉన్న గోడౌన్‌ను బాడుగకు ఇచ్చే విషయంపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

గోపవరం : మండల పరిధిలోని మడకలవారి పల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 24 లో గల 0.70 సెంట్ల విస్తీర్ణంలోని చెరువు పోరంబోకులో వెలసిన అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వారిపై కఠినచర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా నిఘా ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొన్ని సర్వే నెంబర్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించామని, త్వరలోనే మరిన్ని సర్వేనెంబర్లలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాల్లో గల అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని అన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ పారిధిలోని పలు వార్డుల్లో సోమవారం పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పర్యవేక్షించారు. ఎద్దుల వెంకటసుబ్బయ్య బాలికల ఉన్నత పాఠశాల వద్ద కాలువలో పేరుకుపోయిన సిల్ట్‌ను పారిశుధ్య కార్మికులతో తొలగించారు. వైఎంఆర్ కాలనీలోని పార్కును కమిషనర్ పరిశీలించారు. అక్కడ ఉన్న టీ షాపు యజమానికి టీ కప్పులను డస్ట్ బిన్‌లో వేయాలని కమిషనర్ తెలిపారు. పెద్దమ్మతల్లి చెట్టు వద్ద ఉన్న చెత్తపాయింట్‌ను సిబ్బందిచే శుభ్రం చేయించారు. కొర్రపాడు రోడ్డులోని డంప్ యార్డులో ఉన్న వర్మీకంపోస్టు ఎరువును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, ఎస్.నూర్‌బాషా, వి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



కవలకుంట్ల విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్సీ, నాయకులు

పోరుమామిళ్ల : కవలకుంట్ల గ్రామంలో సోమవారం జరిగిన శ్రీ సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేత ధ్వజ శిఖర, కలశ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, యువనేత ఆదిత్యారెడ్డి పాల్గొన్నారు. వేద పండితులు పార్టీ నాయకులకు సాదర స్వాగతం పలికి, ఆశీస్సులు అందచేశారు. ఈ కార్యక్రమంలో బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, సర్పంచులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక రూపరాంపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం 10–30 గంటలకు ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. గ్రామపెద్దలు,యువత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంచ్ కొడితే పతకమే

- తైక్వాండోలో ప్రొద్దుటూరు విద్యార్థినుల సత్తా
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఆర్.వెంకటమోక్షిత



అల్విన సహస్ర



తైక్వాండోలో సాధన చేస్తున్న చిన్నారులు



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కొందరు విద్యార్థినులు ముందడుగు వేస్తున్నారు. చిన్న వయసు నుంచే ఆటలపై పట్టు సాధించి పోటీల్లో సత్తా చాటి.. రాష్ట్ర స్థాయిలో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. ప్రొద్దుటూరులోని గురువయ్య తోటలో ఎస్‌వీవీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కోచ్ రాజేష్ పర్యవేక్షణలో విద్యార్థులు తైక్వాండోలో శిక్షణ పొందుతున్నారు. వారిలో కొంత మంది విద్యార్థులు గతేడాది నవంబర్‌లో కడపలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించారు. అలాగే డిసెంబర్ నెలలో ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్– 20 తైక్వాండో పోటీల్లో కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కాకినాడలో జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ చాంపియన్ షిప్ –2025 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అందులో ఎక్కువ భాగం ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థులు ఉండటం విశేషం. ప్రొద్దుటూరుకు చెందిన మహిత, ఏసరి, కీర్తన, హోషిక, విజయసుందర్‌రాజు కాకినాడలో జరిగిన తైక్వాండో పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

పట్టణంలోని గురువయ్యతోటలో గల గౌతమ్ పాఠశాలలో 3వ తరగతి చవుతున్న ఆర్.వెంకటమోక్షిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆరు నెలలుగా రోజుకు రెండు గంటల పాటు వెంకటమోక్షిత సాధన చేస్తూ తైక్వాండోలో మెలకువలను నేర్చుకుంది. చదువుతోపాటు తైక్వాండోలో రాణిస్తోంది. గత ఏడాది నవంబర్‌లో కడపలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. ప్రకాశం జిల్లాలోని కందుకూరులో జరిగిన అండర్–18 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది. కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి రెండో స్థానంలో నిలిచింది. ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెంకట మోక్షిత ఎంపికైనట్లు కోచ్ రాజేష్ పేర్కొన్నారు.

పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న అల్విన సహస్ర పట్టుదలతో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పలు పతకాలను సాధించింది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ దక్కించుకుంది. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే తన ఆశయమని ఆమె పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరామర్శ



కృష్ణయ్యను పరామర్శిస్తున్న రఘురామిరెడ్డి

దువ్వూరు : మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొత్తపల్లె కృష్ణయ్య ఐదు రోజుల క్రితం కడపలో గుండెకు స్టంట్ వేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సోమవారం నేలటూరులోని కృష్ణయ్య ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రఘురామిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, గుడిపాడు సర్పంచ్ మాబు షరీఫ్, పాలిమేర భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అతి వేగం ప్రమాదకరం



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీరామ్

మైదుకూరు : పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడుపుతూ ప్రయాణించడం ప్రమాదకరమని మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీరామ్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ మొబైల్ రైడింగ్, జిగ్ జాగ్ డ్రైవింగ్, మద్యపానం సేవించి వాహనాలను నడపడం, శిరస్త్రానం లేని ప్రయాణం ప్రమాదకరమని తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, జీబ్రా క్రాసింగ్‌ల వద్ద నిదానంగా గమనించి ప్రయాణించాలని సూచించారు. వనిపెంట రోడ్డులో ప్రమాదాలను నిరోధించడం కోసం స్పీడ్ బ్రేకర్లను వేయిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, అందువల్ల యువత భద్రంగా ఉండటం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని రాయచోటి శ్రీదీప బ్లడ్ సెంటర్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తరుణేందు శేఖర్ మాట్లాడుతూ యువత సేవా భావం కలిగి రక్తదానం చేయాలన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన 35 మంది విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదీప బ్లడ్ సెంటర్ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ సాయి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్‌వీ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ క్రీడా పోటీల్లో ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని ఆర్‌సీపీఈ కళాశాల విద్యార్థులు వైవీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవిశంకర్ తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో కమలాపురంలో జరిగిన యోగివేమన విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలో పురుషులు, మహిళల విభాగంలో రెండో స్థానం, సాఫ్ట్‌బాల్ పోటీలో పురుషులు రెండో స్థానం, మహిళలు మూడో స్థానం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. వీరిలో దక్షిణ అంతర్ విశ్వవిద్యాలయం హ్యాండ్ బాల్ పోటీలకు నారాయణ, సూర్యం, రాజేష్, హరికృష్ణ ఎంపికయ్యారన్నారు. ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ సాఫ్ట్ బాల్ పోటీలకు రవీంద్ర, గురుశివయ్య, రాజేష్, నారాయణ, సర్వేశ్వరరావు, రెడ్డి శేఖర్, సౌజన్య, అక్షిత, ఉషారాణి, నందిని ఎంపికయ్యారని వివరించారు. వీరిని ప్రిన్సిపాల్, పోటీల విభాగాధిపతి డాక్టర్ పి.నరసింహారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

జూదరుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక దేవాంగపేటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. దేవాంగపేటలోని జ్యోతినగర్‌లో ఉన్న ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు కలిసి పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.63,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ వారు విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచిల నుంచి మొత్తం 178 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

చిత్రలేఖనం పోటీల్లో బహుమతి

ఖాజీపేట : జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఖాజీపేట మండలంలోని భీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్ విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించారు. ఎంఆర్ గోవిందరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 9వ తేదీన నంద్యాలలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో గురు రాఘవ కార్తీక్ అనే విద్యార్థి స్వర్ణ పతకం సాధించాడు. కరస్పాండెంట్ భీరం సుబ్బారెడ్డి, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత విద్యార్థిని అభినందించారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టి.ఓబుళరెడ్డి, వరలక్ష్మి దంపతులు, వారి కుమారుడు భరత్ చంద్రారెడ్డి, కుమార్తె హర్షిత్ రెడ్డి సహకారంతో ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డీలర్ల అక్రమాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఖాజీపేట : కార్డుదారులకు అందించాల్సిన బియ్యం సక్రమంగా పంపిణీ చేయకుండా డీలర్లు నొక్కేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ పీపీ రాఘవరెడ్డి, మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డిలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు ప్రతి కార్డుకు రెండు కేజీల బియ్యం పట్టుకుని ఇస్తున్నారని చెప్పారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలని సోమవారం తహసీల్దార్ గంగయ్యకు ప్రజాపక్షం పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ రాజధాని అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న అటవీ శాఖ భూమిని తీసుకుని.. అందుకు సమానంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ భూములను అటవీశాఖకు బదలాయించారన్నారు. ప్రొద్దుటూరు అటవీ డివిజన్ పరిధి కాశినాయన మండలంలోని ఇటుకులపాడు, సాయిశెట్టిపల్లె, సిద్దవటం మండలంలోని పెద్దపల్లె, నేకాపురం గ్రామాల్లోని 5,265 ఎకరాలను అటవీ శాఖకు బదిలీ చేశారన్నారు. ఒక ఎకరా ఒక నిరుద్యోగ యువతకు ఇచ్చినా దాదాపు 5,300 మంది నిరుద్యోగులు జిల్లాలో లబ్ధి పొందుతారన్నారు. అమరావతి రాజధాని ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించడంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి నిరుద్యోగ యువతకు సమాన అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు అబ్దుల్ రహీం, మల్లికార్జున శెట్టి, రాము, నరాల బాలిరెడ్డి, రామమోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డి, సత్యనారాయణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి



విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

బద్వేలు అర్బన్ : ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. మండల అభివృద్ధి అధికారి రామ్‌నాథ్ రెడ్డి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్,డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరు : అట్లూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్ బాబు ఆల్‌బెండజోల్‌ను తినిపించారు. స్థానిక వైద్యాధికారిణి డాక్టరు హమీదాబేగం, ఎంఈఓ ఖాదర్‌వల్లి, సీహెచ్‌ఓ మురళీకృష్ణా, మరియూ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్

ప్రొద్దుటూరు క్రైం : లారీ డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలను నడపాలని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ లారీల్లోనే అన్ని రకాల వస్తు రవాణా జరుగుతోందని తెలిపారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాలకు కూడా డ్రైవర్లు వెళ్తుంటారని చెప్పారు. తగు విశ్రాంతి తీసుకుంటూ డ్రైవర్లు వాహనాలను నడపాలని తెలిపారు. సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్ మాట్లాడుతూ లారీ కండీషన్‌ను దృష్టిలో ఉంచుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. రాత్రి వేళల్లో నిరంతరాయంగా డ్రైవింగ్ చేయరాదని పేర్కొన్నారు. జాతీయ రహదారుల్లో వెళ్లేటప్పుడు రహదారి నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాసరెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టైఫండ్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పశువైద్య కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : పశువైద్య కళాశాల విద్యార్థుల స్టైఫండ్‌పై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని పశువైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. గోపవరం గ్రామ సమీపంలోని పశువైద్య కళాశాలలో సోమవారం విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేపర్ ప్రకటన ద్వారా, ప్రత్యేక జీవో ద్వారా ఎంబీబీఎస్ మెడికల్ విద్యార్థులతో సమానంగా తమ స్టైఫండ్‌ను రూ.26 వేలు పెంచుతున్నట్లు ప్రకటించాలన్నారు. తమకు ఇచ్చే స్టైఫండ్ రూ.7 వేలు, ప్రస్తుతం పెరిగిన ధరలకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. స్టైఫండ్ పెంచే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగో సంవత్సరం చదువుతున్న పశువైద్య విద్యార్థులు శివతరుణ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, భూములు ఇచ్చే వరకు పోరాటం

మైదుకూరు : పేదలకు ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమి మంజూరు చేసేంత వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ నాయకులు అన్నారు. భూమిలేని నిరుపేదలకు హెక్టారు భూమిని, ఇంటి స్థలాన్ని ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఏడు నెలలుగా పేదలకు ఇళ్ల స్థలాలు, బంజరు భూములు ఇవ్వాలని దశల వారిగా ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. కోనేరు రంగారావు కమిషన్ సిఫారసు చేసిన విధంగా ప్రతి పేద కుటుంబానికి ఒక హెక్టార్ భూమి పంపిణీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరాం, బీకేఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.షావలి, పీరయ్య, బీవీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పత్తా లేని వ్యవసాయ విస్తరణాధికారి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గొడ్లవీడు గ్రామ పంచాయతీ రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఎం.హరికృష్ణ గత 20 రోజులుగా కార్యాలయానికి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం గొడ్లవీడు గ్రామ రైతులు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు బి.మఠం వచ్చారు. వారు విలేకరులతో మాట్లాడుతూ గొడ్లవీడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 300 ఎకరాల్లో సొద్ద, 150 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశామన్నారు. రైతులకు ప్రభుత్వం ఏ పథకాలు అందిస్తుందో ఇంతవరకు సచివాలయ వ్యవసాయ విస్తరణాధికారి చెప్పలేదన్నారు. త్వరగా ఎరువులు రావాలంటే రైతులు డబ్బులు ఇవ్వాలన్నారు. కనీసం పంటను ఈ క్రాప్ కూడా చేయలేదన్నారు. డబ్బులు వసూలు చేసుకున్నాక ఇంతవరకు రైతు సేవా కేంద్రానికి రాలేదన్నారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఒక మాత్ర తినిపిద్దాం.. నులిపురుగులను నిర్మూలిద్దాం

చాపాడు : పిల్లల్లో రక్తహీనతను నివారించి పోషకాహార ఉపయోగితను మెరుగుపరిచేందుకు ప్రతి విద్యార్థికి ఒక అల్బెండజోల్ మాత్ర తినిపించి వారిలోని నులిపురుగులను నిర్మూలిద్దామని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రమైన చాపాడు జెడ్పీ హైస్కూల్‌లో డాక్టర్ రాజేష్‌కుమార్, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారులు కావ్యమాధురి, ఓబులేసు, స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ వీరకిషోర్ విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను తినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు వారి ఉపాధ్యాయుల సమక్షంలో అల్బెండజోల్ మాత్రలను తినిపించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అబ్జర్వర్ అనూష పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబుల్‌రెడ్డి, ప్రసాద్, ఏఎన్‌ఎంలు స్రవంతి, శాంతకుమారి, సుజాత, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చాపాడు : నులిపురుగుల నిర్మూలన మాత్రలను తినిపిస్తున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్



ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థికి మాత్రలను మింగిస్తున్న మునిపల్ కమిషనర్ మల్లికార్జున

మైదుకూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, తెలుగు అధ్యాపకురాలు అనురాధ లక్ష్మీ నులిపురుగుల నివారణ ఆల్‌బెండజోల్ మాత్రల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్, ఆర్ఆర్‌సీ కో ఆర్డినేటర్లు కృష్ణారెడ్డి, అయ్యవారిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : పుల్లారెడ్డిపేటలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు రోషిణి, వికసిత ఆల్‌బెండ జోల్ మాత్రలను తినిపించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, సువర్ణ, శ్రావణి, ఏఎన్‌ఎంలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ఖాజీపేట ఆరోగ్య కేంద్రంలోని పిల్లలకు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగభూషణ్‌రెడ్డి అల్బెండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆయిషా సుల్తానా, డాక్టర్ సుమంత్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ కృష్ణ ప్రియ, శోభన్‌బాబు, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా మలేరియా అధికారిణి పి.మనోరమ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు సంపత్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, డీఎంహెచ్‌ఓ ఆఫీస్ ఆరోగ్యవిస్తరణఅధికారి శివరాంరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ డి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. నులిపురుగుల నివారణ దినం సందర్భంగా పట్టణంలోని ఎస్ఎస్‌వీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భరత్‌నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఉపాధ్యాయుడు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్ : కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలో ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 97 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. దొరసానిపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సూపర్‌వైజర్స్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని అరవింద ఇంటిగ్రల్ స్కూల్‌లో విద్యార్థులకు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, డాక్టర్ హిమబిందు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఓ సుబ్బారెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు మల్లేశ్వరమ్మ, సునీత, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.